మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 15-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 16 Issue: 16

15 జూలై 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:53 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి పాడ్యమి ఉ. 11:54 వరకు తరువాత విదియ సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పుష్యమి రా. 9:47 వరకు తరువాత ఆశ్లేష యోగం హర్షణ ఉ. 8:01 వరకు కరణం బవ ఉ. 11:54 వరకు భాలవ రా. 10:22 వరకు వర్జ్యం ఉ. 7:21 నుండి ఉ. 8:47 వరకు దుర్ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు రాహుకాలం మ. 12:22 నుండి మ. 1:59 వరకు యమగండం ఉ. 7:30 నుండి ఉ. 9:07 వరకు గుళికాకాలం ఉ. 10:45 నుండి మ. 12:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:17 నుండి తె. 5:05 వరకు అమృత ఘడియలు మ. 3:59 నుండి సా. 5:26 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial





# పీవోకే గుండెల్లో బుల్లెట్లు!

## కశ్మీరంలో పారుతున్న నెత్తుటి ధారలు.. ఆందోళనకారులపై పాక్ ఆర్మీ కాల్పులు

### పాక్‌కు వ్యతిరేకంగా 40 లక్షల మంది నిరసన.. ప్రాణాలు కాపాడాలని భారత్‌కు విన్నపం

పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళన చేస్తున్న నిరసనకారులపై పాక్ పోలీసులు, రేంజర్లు కాల్పులు జరపడంతో ఆరుగురు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఆందోళనకారులు గాయపడ్డారు. కొంతకాలంగా పీవోకేలో ఇంటర్నెట్ నిలిపివేయడంతో దాదాపు 40 లక్షల మంది ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని నిరసనకారులు తెలిపారు.

ముజఫరాబాద్: తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పీవోకే ప్రజలు వాపోతున్నారు. తమ ప్రాణాలను కాపాడాలని, మానవతా సాయం అందించాలని భారత్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. పూంఛ్, దోడా సెక్టార్లలో నియంత్రణ రేఖను తెరవాలని కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలపై పాక్ అణచివేత ధోరణిని భారత్ తీవ్రంగా విమర్శించింది. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న వ్యవస్థాగత దోపిడీ, బలవంతపు ఆక్రమణలు, అణచివేత వల్లే ఈ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తరువాయి 2 వ పేజీలో...



## ఇరాన్ దాడిలో భారతీయుడు మృతి

### మరో ఆరుగురు భారతీయులకు గాయాలు

ఇరాన్‌పై తీవ్రంగా మండిపడ్డ భారత్

రాయబారిని పిలిపించి మందలింపు

టెహ్రాన్: హర్మూజ్ జలసంధిలో యూఏఈకి చెందిన చమురు ట్యాంకర్లపై జరిగిన దాడిలో ఓ భారతీయుడు మరణించిన ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనకు సంబంధించి భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మహ్మద్ జావెద్ హుస్సేనీని విదేశాంగ శాఖ పిలిపించి నిరసన తెలిపింది. -2 వ పేజీలో...

# ఏఐ.. ఆగం జేస్తాంది



### పైసలు బొక్క.. కంపెనీల జ్ఞానం గాయబ్

### ఏఐతో 'రివర్స్ ఇన్ఫర్మేషన్ పారడాక్స్'

### సంస్థాగత పరిజ్ఞానం కాపాడుకోవాలి

### కంపెనీలకు సత్య నాదెళ్ల వార్నింగ్

కృత్రిమ మేధ(ఏఐ) వాడకంలో కంపెనీలు తమకు తెలియకుండానే రెండుసార్లు మూల్యం చెల్లిస్తున్నాయని మైక్రోసాఫ్ట్ సీఈఓ, భారత సంతతికి చెందిన సత్య నాదెళ్ల హెచ్చరించారు. ఒకటి డబ్బు రూపంలో అయితే, రెండోది అంతకంటే విలువైన తమ సొంత యాజమాన్య పరిజ్ఞానాన్ని కోల్పోవడం ద్వారా అని ఆయన తన వ్యక్తిగత బ్లాగ్‌లో విశ్లేషించారు. ఏఐ మోడల్ మెరుగ్గా పనిచేయాలంటే, దానికి మన సంస్థకు సంబంధించిన ఎక్కువ సమాచారాన్ని అందించాల్సి ఉంటుందని, ఈ క్రమంలో కంపెనీలు తమ విలువైన జ్ఞానాన్ని కోల్పోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూయార్క్: ఈ అంశాన్ని వివరించేందుకు నాదెళ్ల, నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త కెన్నెత్ ఆరో ప్రతిపాదించిన 'ఇన్ఫర్మేషన్ పారడాక్స్' (సమాచార వైరుధ్యం) సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. ఆరో సిద్ధాంతం ప్రకారం, ఒక సమాచారం విలువ ఏంటో తెలియకుండా తరువాయి 2 వ పేజీలో...



## మూడో భాష బుగులు.. అదే ముఖ్యం బిగులు!

### పాఠశాల అంతర్గత పరీక్ష తప్పనిసరి.. పాస్ అయితేనే టెన్త్ సర్టిఫికెట్

### 2026-27లో 'పది'లో మార్పుల్లేవు.. 6వ తరగతి కొత్త బ్యాచ్ నుంచి అమలు

సీబీఎస్ఈ 10వ తరగతి విద్యార్థుల మూడో భాష పరీక్షపై వస్తున్న సందేహాలకు బోర్డు స్పష్టత ఇచ్చింది. ప్రస్తుతం 9వ తరగతిలో చేరిన విద్యార్థులకు 10వ తరగతిలో మూడో భాషకు బోర్డు పరీక్ష ఉండదని ప్రకటించింది. అయితే పాస్ సర్టిఫికెట్ పొందాలంటే ఆ భాషలో పాఠశాల నిర్వహించే అంతర్గత మూల్యాంకన పరీక్షలో తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)-2020లో భాగంగా అమలు చేస్తున్న మూడు భాషల విధానంపై జులై 10న విడుదల చేసిన మార్గదర్శకాల్లో ఈ వివరాలు వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరంలో 9వ తరగతిలో చేరే విద్యార్థులు మూడు భాషలు చదవాల్సి ఉంటుందని, వాటిలో కనీసం రెండు భారతీయ భాషలు ఉండాలని పేర్కొంది. అయితే ఈ బ్యాచ్ విద్యార్థులకు -2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,280 |
| వెండి (కిలో): | రూ.2,35,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,938 |

## ముద్రగడ పద్మనాభం కన్నుమూత



### కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు

అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో మృతి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన - 2 వ పేజీలో...



## 'రాజీ'కీయంతోనే అభివృద్ధి!

### వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లకు మెరుగులు..

### వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు 'కాకతీయ' హంగులు

2028 జూన్ 2 నాటికి చేయాలి.. కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ: అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో...



## పశ్చిమాన లొల్లులు.. మార్కెట్లకు చిల్లులు


### భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 561, నిఫ్టీ 159 పాయింట్ల నష్టం

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి వెల్లువెత్తింది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, రియల్టీ, ఆటో స్టాక్స్‌లో భారీగా నష్టాలు నమోదయ్యాయి.

ముంబై: ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 561.46 పాయింట్లు నష్టపోయి 77,054.94 వద్ద స్థిరపడింది. -2 వ పేజీలో...

## విశ్వవాణి



హెపటైటిస్-బీ చికిత్సలో శాస్త్రవేత్తలు కీలక పురోగతి సాధించారు. తాజా పరిశోధనలో కాలేయంలోని సీడీ4 పాజిటివ్ టీ (సీడీ4 ప్లస్ టీ) రోగనిరోధక కణాలువైరస్‌ను నిర్మూలించడంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడైంది. ల్యాబ్ అధ్యయనాలతో పాటు రోగుల నమూనాలపై నిర్వహించిన పరిశోధనలో, కొంతమంది రోగుల్లో యాంటీవైరల్ చికిత్సను వైద్యుల పర్యవేక్షణలో నిలిపివేసిన తర్వాత ఈ కణాలు మరింత చురుకుగా పనిచేసి శరీరంలోని ఇతర రోగనిరోధక కణాలను సమన్వయం చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో వైరస్‌పై సమిష్టిగా దాడి చేసే రోగనిరోధక వ్యవస్థ బలపడుతోంది. చికిత్స ముగిసిన తర్వాత కొద్దిమంది రోగుల్లో వైరస్ సహజంగానే పూర్తిగా తొలగిపోవడానికి ఇదే కారణమని పరిశోధకులు భావిస్తున్నారు.




### షడ్భుజి ఆకృతితో కొత్త సాంకేతికత.. తగ్గిన ప్యానెళ్ల బరువు.. పెరిగిన బలం

న్యూఢిల్లీ: కోట్లాది సంవత్సరాల క్రితమే ప్రకృతి ఒక అద్భుతమైన ఇంజనీరింగ్ అద్భుతాన్ని సృష్టించింది. అదే 'తేనెపట్టు'. అతి తక్కువ మైనాన్ని ఉపయోగించి, గరిష్ఠ స్థలంలో అత్యంత పటిష్టంగా గూడును ఎలా నిర్మించాలో తేనెటీగలు ఎప్పుడో కనిపెట్టాయి. వాటి షడ్భుజి ఆకృతికి ఉన్న పటిష్టత.. ఎప్పటి నుంచో శాస్త్రవేత్తలను ఆకర్షిస్తూ వస్తోంది. ఇప్పుడు అదే బయోమిమిక్రీ సూత్రాన్ని ఆధారం చేసుకుని శాస్త్రవేత్తలు సౌర విద్యుత్ రంగంలో ఒక పెద్ద విప్లవానికి తరువాయి 2 వ పేజీలో...




### సూర్యుడికే సురుకులు.. సూర్యుడిని 'డిమ్' చేసేలా శాస్త్రవేత్తల వ్యూహం

న్యూయార్క్: ఎల్‌నినో భయం ప్రపంచాన్ని వెంటాడుతోంది. ఇప్పటికే దీని ప్రభావం మొదలైంది. ఇలాంటి తీవ్ర ప్రభావాలను తగ్గించేందుకు శాస్త్రవేత్తలు కొత్త ఆలోచనను తెరపైకి తీసుకొచ్చారు. సూర్యకాంతి భూమిపైకి తక్కువగా చేరేలా మేఘాలను మరింత ప్రకాశవంతంగా మార్చగలిగితే ఎల్‌నినో ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని తాజా అధ్యయనం చెబుతోంది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా-శాన్ డియాగో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

15.7.2026

మేషం: ఈరోజు మీరు చేపట్టే పనుల్లో వేగం, స్పష్టత కనిపిస్తాయి. ఉద్యోగంలో మీ ప్రతిభకు గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. కుటుంబ సభ్యుల సహకారం మీకు ఉత్సాహాన్ని ఇస్తుంది. ఆరోగ్యంపై స్వల్ప శ్రద్ధ వహిస్తే రోజు సాఫీగా గడుస్తుంది.

వృషభం: కొత్త అవకాశాలు మీ ముందుకు రావచ్చు. ఉద్యోగంలో బాధ్యతలు పెరిగినా వాటిని సమర్థంగా నిర్వహిస్తారు. ఆదాయంలో స్వల్ప మెరుగుదల కనిపిస్తుంది. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. ప్రయాణాలకు అనుకూలమైన రోజు.

మిథునం: పని ఒత్తిడి ఉన్నప్పటికీ మీరు సమయానికి పనులు పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు సులభంగా పూర్తవుతాయి. కుటుంబ సభ్యులతో అనుబంధం బలపడుతుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది.

కర్కాటకం: చాలాకాలంగా ఎదురుచూస్తున్న పనులు ముందుకు సాగుతాయి. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. వ్యాపారంలో లాభదాయకమైన అవకాశాలు లభిస్తాయి. కుటుంబంలో శుభవార్తలు ఆనందాన్ని కలిగిస్తాయి. ఖర్చులను నియంత్రించడం మంచిది.

సింహం: మీ నిర్ణయాలు అనుకూల ఫలితాలను ఇస్తాయి. అధికారులతో జరిగే చర్చలు విజయవంతమవుతాయి. ఆర్థిక పరిస్థితి బలపడే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. కొత్త పనులు ప్రారంభించడానికి అనుకూలమైన రోజు.

కన్య: ఉద్యోగంలో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. వ్యాపారంలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆరోగ్యపరంగా చిన్న జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయాన్ని అందుకుంటారు.

తుల: చేపట్టిన పనులు కొంత ఆలస్యమైనా చివరకు విజయవంతంగా పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో ప్రణాళికతో వ్యవహరించడం మంచిది. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఉద్యోగంలో సహచరుల సహకారం లభిస్తుంది. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి.

వృశ్చికం: భాగస్వామ్య వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందే అవకాశం ఉంది. ఆర్థిక లాభాలు పొందుతారు. కుటుంబంలో ఆనందకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది.

ధనస్సు: మీ కృషికి తగిన ఫలితం లభిస్తుంది. కొత్త పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. ఆదాయం పెరిగే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత నెలకొంటుంది. ముఖ్యమైన నిర్ణయాలను ధైర్యంగా తీసుకోవచ్చు.

మకరం: ఉద్యోగంలో అనుకూల వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి సంబంధిత పనులు ముందుకు సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం మంచిది.

కుంభం: వ్యాపారంలో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో మీ పనితీరుకు ప్రశంసలు దక్కుతాయి. ఆర్థికంగా లాభదాయకమైన రోజు. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. కుటుంబంలో ఆనందం పెరుగుతుంది.

మీనం: ఈరోజు అదృష్టం మీకు అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఆరోగ్యం సాధారణంగా అనుకూలంగా ఉంటుంది.

# ఏఐ.. ఆగం జేస్తాంది

మొదటి పేజీ తరువాయి

కొనుగోలుదారు దాన్ని కొనలేడు, కానీ ఒకసారి ఆ సమాచారం తెలిశాక, దానికోసం చెల్లించాల్సిన అవసరం ఉండదు. అయితే, ఏఐ యుగంలో ఈ సమస్య తలకిందులై 'రివర్స్ ఇన్ఫర్మేషన్ పారడాక్స్'గా మారిందని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఇక్కడ కొనుగోలు చేసిన ఏఐ సాధనాన్ని వినియోగించుకోవడం కోసం, కొనుగోలుదారుడే తన విలువైన పరిజ్ఞానాన్ని విక్రేతకు (ఏఐ ప్రొవైడర్) అప్పగించాల్సి వస్తోందని వివరించారు. మణిపాల్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన నాదెళ్ల, ఈ ప్రక్రియ వల్ల ఏఐ ప్రొవైడర్లకు, వాడుకదారులైన కంపెనీలకు మధ్య సమాచార అసమానత పెరుగుతుందని హెచ్చరించారు. ఈ సమస్యకు పరిష్కారంగా కంపెనీలు తమ 'లెర్నింగ్ లూప్'పై పూర్తి నియంత్రణ సాధించాలని నాదెళ్ల సూచించారు. ఉద్యోగులు ఏఐకి ఇచ్చే ప్రతి ప్రాంప్ట్, ఏఐ తప్పు చేసినప్పుడు అందించే సవరణలు, రూపొందించే వర్క్‌ఫ్లోలు వంటివన్నీ విలువైన సంస్థాగత పరిజ్ఞానంగా మారతాయని అన్నారు.

కాలక్రమేణా ఇదే ఒక కంపెనీకి పోటీలో ఆధిక్యాన్ని అందిస్తుందని, అలాంటి పరిజ్ఞానాన్ని తెలియకుండా ఏఐ ప్రొవైడర్లకు అప్పగించకూడదని స్పష్టం చేశారు. కంపెనీలు తమ అంతర్గత సమాచారం, కస్టమర్లతో జరిపే సంభాషణలు, ఏఐ ద్వారా పొందిన విశ్లేషణలు వంటివి తమ అనుమతి లేకుండా బయటి ఏఐ మోడళ్ల అభివృద్ధికి ఉపయోగపడకుండా ఒక కొత్త 'ట్రస్ట్ బౌండరీ' (విశ్వసనీయత సరిహద్దు) ఏర్పాటు చేసుకోవాలని నాదెళ్ల పిలుపునిచ్చారు. అంతేకాకుండా, వ్యాపార సంస్థలు ఒకే ఏఐ ప్రొవైడర్‌పై ఆధారపడకుండా ఉండాలని గట్టిగా సూచించారు. వేర్వేరు ఏఐ మోడళ్ల మధ్య సులభంగా మారగలిగే వ్యవస్థలను నిర్మించుకోవడం ద్వారా ఖర్చులను నియంత్రించుకోవచ్చని, వెండర్ లాక్-ఇన్ సమస్యను అధిగమించవచ్చని ఆయన వివరించారు. ఏఐ యుగంలో నిజమైన పోటీతత్వం కేవలం టెక్నాలజీని వాడటంలో కాదని, దాని వాడకం ద్వారా సృష్టించిన పరిజ్ఞానాన్ని సొంతం చేసుకోవడంలోనే ఉందని పేర్కొన్నారు.

## ఇరాన్ దాడిలో భారతీయుడు మృతి

మొదటి పేజీ తరువాయి

ఒమన్‌కు సమీపంలోని హర్మూజ్ జలసంధి దక్షిణ మార్గంలో ప్రయాణిస్తున్న 'మొంబాసా', 'అల్ బహియాహ్' చమురు ట్యాంకర్లపై ఈ దాడి జరిగింది. 'మొంబాసా' నౌకలో పనిచేస్తున్న ఓ భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడగా, వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాడి కారణంగా రెండు ట్యాంకర్లలోనూ మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. అయితే వెంటనే సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో రెండు నౌకలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఈ దాడిని అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఖండించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వానికి ఇది తీవ్ర ముప్పు అని అభివర్ణించింది. ఈ పరిణామంపై స్పందించే పూర్తి హక్కు యూఏఈకి ఉందని స్పష్టం చేసింది. దేశ భద్రత, ప్రజలు, జాతీయ ప్రయోజనాలు, కీలక ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## తేనెపట్టు.. సోలార్ హిట్టు!

మొదటి పేజీ తరువాయి

తెరతీశారు. సంప్రదాయ సోలార్ ప్యానెళ్ల బరువును సగానికి సగం తగ్గించి వాటి బలాన్ని పెంచే సరికొత్త డిజైన్‌ను రూపొందించారు. సాధారణంగా సోలార్ ప్యానెళ్లు భారీ గ్లాస్, వెనుక వైపు మందపాటి బ్యాక్‌షీట్‌తో ఉండి చాలా బరువుగా ఉంటాయి. కానీ, శాస్త్రవేత్తలు భారీ గ్లాస్ స్థానంలో 'అల్యూమినియం హనీకోంబ్ శాండ్‌విచ్' నిర్మాణాన్ని ప్రవేశపెట్టారు. రెండు పల్చని పొరల మధ్య తేనెపట్టు లాంటి అల్యూమినియం గదులను అమర్చారు. ఇది ప్యానెల్‌కు అవసరమైన దృఢత్వాన్ని ఇస్తూనే నిర్మాణంలో వాడే పదార్థాల వినియోగాన్ని, బరువును భారీగా తగ్గించింది. ఈ సరికొత్త సాంకేతికతతో తయారు చేసిన ప్యానెళ్లు చదరపు మీటరుకు కేవలం 6.2 కిలోల బరువు మాత్రమే ఉన్నాయి. అంటే సాంప్రదాయ ప్యానెళ్లతో పోలిస్తే ఇవి ఏకంగా 48 శాతం తేలికైనవి. అయితే బరువు తగ్గింది కదా అని వీటి నాణ్యత ఏమాత్రం తగ్గలేదు. విపరీతమైన వేడి, మంచు తుఫానులు, అతినీలలోహిత కిరణాల ప్రభావం, మెకానికల్ లోడ్ వంటి కఠినమైన అంతర్జాతీయ నాణ్యత పరీక్షలన్నింటిలోనూ ఈ హనీకోంబ్ ప్యానెళ్లు విజయవంతంగా పాసయ్యాయి. ఈ తేలికపాటి ప్యానెళ్ల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బరువు తక్కువగా ఉండటం వల్ల వీటిని ఒక చోటు నుండి మరోచోటికి రవాణా చేయడం, బిల్డింగులపై అమర్చడం చాలా సులభం కానుంది. ముఖ్యంగా పాతకాలపు భవనాలు, ఎక్కువ బరువు మోయలేని పారిశ్రామిక షెడ్ల పైకప్పులపై కూడా వీటిని ఎలాంటి ప్రమాదం లేకుండా అమర్చుకోవచ్చు. అలాగే తయారీలో తక్కువ ముడిసరుకు వాడటం వల్ల కంపెనీలకు ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా హరిత ఇంధనానికి డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి కానుంది. కేవలం ఇళ్లపైనే కాకుండా.. వాహనాలు, పోర్టబుల్ పవర్ సిస్టమ్స్, చివరికి అంతరిక్ష నౌకల్లో కూడా ఈ తేలికపాటి ప్యానెళ్లను వాడుకునే అవకాశం ఉంది.



## మబ్బులకు మెరుపులు..

మొదటి పేజీ తరువాయి

పరిశోధకులు ఈ అంశంపై అధ్యయనం నిర్వహించారు. సూర్యకాంతి వాతావరణంతో పరస్పర చర్యను మార్చడం ద్వారా తీవ్ర వాతావరణ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించే అవకాశాలను ఇందులో పరిశీలించారు. ఈ ప్రతిపాదన ప్రకారం భూమి ఎగువ వాతావరణ పొరలో ప్రత్యేక 'ఏరోసాల్స్'ను విడుదల చేయాలి. దీంతో సముద్రాలపై ఏర్పడే మేఘాలు మరింత ప్రకాశవంతంగా మారతాయి. అవి సూర్యకిరణాలను తిరిగి అంతరిక్షంలోకి ప్రతిఫలింపజేస్తాయి. ఫలితంగా భూమి ఉపరితలం కొంత చల్లబడే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఈ విధానాన్ని 'మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్'గా పేర్కొన్నారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితలంపై ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడమే సూపర్ ఎల్‌నినోకు ప్రధాన కారణం. దీని వల్ల కరవు, భారీ వర్షాలు, వడగాలుల వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులు ఏర్పడతాయి. ఈ ప్రభావాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందని పరిశోధకులు తెలిపారు. 1997, 2015లో నమోదైన ఎల్‌నినో పరిస్థితులను ఆధారంగా చేసుకొని నిర్వహించిన కంప్యూటర్ అనుకరణల్లో ఈ విధానం చల్లదనాన్ని, పొడిబారే ప్రభావాన్ని దాదాపు 40 శాతం పెంచగలదని గుర్తించారు. అయితే ఈ విధానంపై శాస్త్రవేత్తల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. దీర్ఘకాలిక ప్రయోజనం పొందాలంటే ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించాల్సి రావచ్చని కొందరు హెచ్చరిస్తున్నారు. కర్బన ఉద్గారాలను తగ్గించే చర్యల నుంచి దృష్టి మళ్లే ప్రమాదం కూడా ఉందని చెబుతున్నారు. ఈ విధానం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు వస్తాయో ఇప్పటికీ పూర్తిగా తెలియలేదని పేర్కొంటున్నారు. ప్రస్తుతం దీనిని క్షేత్రస్థాయిలో అమలు చేసే ప్రణాళిక ఏదీ లేకపోయినా, పెరుగుతున్న వాతావరణ ముప్పు దృష్ట్యా ఇలాంటి ప్రత్యామ్నాయాలపై పరిశోధనలు అవసరమని అధ్యయన బృందం అభిప్రాయపడింది. దీనికి సంబంధించిన అధ్యయనం 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమైంది.

## ముద్రగడ పద్మనాభం కన్నుమూత

మొదటి పేజీ తరువాయి

ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరపున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.



## పశ్చిమాన లొల్లులు.. మార్కెట్లకు చిల్లులు

మొదటి పేజీ తరువాయి

అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 159 పాయింట్లు క్షీణించి 24,052.05 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. కొన్ని రక్షణాత్మక రంగాల షేర్లు నిలదొక్కుకున్నప్పటికీ, కీలక రంగాల్లో అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి దారితీసింది. నిఫ్టీలో హెచ్‌సీఎల్ టెక్, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ షేర్లు ఎక్కువగా నష్టపోయి సూచీపై భారం మోపాయి. ఈ బలహీనత బ్రాడర్ మార్కెట్లకు కూడా విస్తరించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.44 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.01 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే.. దాదాపు అన్ని సూచీలు నష్టాల్లోనే ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్, నిఫ్టీ ఆటో అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. అయితే, ఈ ప్రతికూల ధోరణికి భిన్నంగా నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ లాభాలతో ముగిసింది. మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా ఇన్వెస్టర్లు ఫార్మా వంటి సురక్షిత రంగాల వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కార్పొరేట్ ఫలితాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, అంతర్జాతీయ ఉద్రిక్తతలు మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయి.

## మూడో భాష బుగులు.. అదే ముఖ్యం బిగులు!

మొదటి పేజీ తరువాయి

10వ తరగతిలో మూడో భాషకు బోర్డు పరీక్ష నిర్వహించబోమని తెలిపింది. పాఠశాల నిర్వహించే మూడో భాష అంతర్గత మూల్యాంకన పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలని సీబీఎస్ఈ పాఠశాలలను ఆదేశించింది. 10వ తరగతి బోర్డు ఫలితాలు విడుదలయ్యేలోపు రీ-అసెస్‌మెంట్ నిర్వహించి అర్హులైన విద్యార్థులకు అవకాశం కల్పించాలని సూచించింది. అలాగే 9వ తరగతిలో మూడో భాషలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులను 10వ తరగతికి ప్రమోట్ చేసినా, తర్వాతి విద్యా సంవత్సరంలో పెండింగ్‌లో ఉన్న పరీక్షను తప్పనిసరిగా పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపింది. 2026-27లో ఇప్పటికే 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రం ఎలాంటి మార్పులు ఉండవని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రెండు భాషల విధానమే వారికి కొనసాగుతుందని తెలిపింది. ఇక 2026-27 నుంచి 6వ తరగతిలో చేరే విద్యార్థులు 10వ తరగతికి వచ్చే సమయానికి మూడో భాష కూడా బోర్డు పరీక్షలో భాగం కానుందని వెల్లడించింది. అప్పటికి అవసరమైన పాఠ్యపుస్తకాలు, సిలబస్, ఇతర విద్యా వనరులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని పేర్కొంది.

## 'రాజీ'కీయంతోనే అభివృద్ధి!

మొదటి పేజీ తరువాయి

కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని సీఎం రేవంత్ తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

## పీవోకే గుండెల్లో బుల్లెట్లు!

మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఆహారం, మందుల సరఫరా నిలిపివేత, ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్, తీవ్ర హింస పాక్ క్రూరత్వానికి నిదర్శనమని విమర్శించారు. అటు, అమెరికాలో స్థిరపడిన పీవోకే పౌరులు వైట్‌హౌస్ ముందు నిరసన చేపట్టారు. ఈ ఘటనలు పాక్ ఆక్రమణకు వ్యతిరేకంగా పీవోకేలో పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి.



## జర.. ఆర్ఆర్ఆర్ సంగతి చూడుర్రి!

రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర (నార్త్) భాగం పనులకు వెంటనే కేబినెట్ ఆమోదం తెలపాలని, దక్షిణ భాగానికి పూర్తి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ కోరారు. రాష్ట్ర జాతీయ రహదారులను డ్రై పోర్టులతో అనుసంధానించే కొత్త దారులకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు.

- న్యూఢిల్లీ, జూలై 14 (ఈవార్తలు)

## ముస్సిపల్ ఏఈ.. నోట్ల కట్టల పాము!

**ఏసీబీ వలలో పెద్దపల్లి అవినీతి తిమింగలం**

పెద్దపల్లి, జూలై 14 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం జరిపిన దాడిలో ఓ అవినీతి అధికారి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా (ఏఈ) పనిచేస్తున్న కల్లేపల్లి సతీశ్ కుమార్, ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడ, కునారం రోడ్డులో ఉన్న హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రావాల్సిన రూ.12.28 లక్షల తుది బిల్లును ప్రాసెస్ చేసి, మంజూరు కోసం పంపడానికి సతీశ్ కుమార్ ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు, కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు పక్కా ప్రణాళికతో సతీశ్ కుమార్ నివాసంలో అతడు లంచం స్వీకరిస్తుండగా పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్న అనంతరం, ఏసీబీ అధికారులు సతీశ్ కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదు లభించడంతో అధికారులు సైతం విస్మయానికి గురయ్యారు. లంచం సొమ్ముతో పాటు ఈ నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సతీశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని, కరీంనగర్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామని పేర్కొన్నారు.

## కడియంపై మీనాక్షికి కొండా సురేఖ ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

## సీఎం రేవంత్‌పై పీఎస్‌లలో ఫిర్యాదులు

షాద్‌నగర్, జూలై 14 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తమ ఫిర్యాదుల్లో వారు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు బీఆర్ఎస్ శ్రేణులు షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకుల రక్తం పంటలపై చల్లితే అవే పండుతాయని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేలా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. భారతీయ న్యాయ సంహిత 2023 కింద తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించి సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మాట్లాడిన సీఎంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## హెచ్ఎండీఏ సీఈ.. కోట్ల పడగ!

**ఏసీబీ వలలో చీఫ్ ఇంజినీర్ రవీందర్**

**అక్రమాస్తుల ఆరోపణలపై ఏకకాలంలో సోదాలు**

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు, రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బీ), 13(2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ ప్లస్ 4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీ-ఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది. వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు.

# 17 కోట్ల ఉద్యోగాలు సృష్టించాం

**8 ఏళ్లలో నిరుద్యోగిత రేటు 3.1 శాతానికి తగ్గింపు**

**కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడి**

**ఉద్యోగ భద్రతతోనే మెరుగైన ఉత్పాదకత: వివేక్**

**15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరం సమ్మిట్ ప్రారంభం**

**14 దేశాల నుంచి 110 మంది ప్రతినిధులు హాజరు**



హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు/పీఐబీ): దేశంలో గత పదేళ్లలో 17 కోట్ల ఉద్యోగాలు సృష్టించామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ప్రారంభమైన 15వ బ్రిక్స్ ట్రేడ్ యూనియన్ ఫోరమ్ సమ్మిట్ - 2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సామాజిక భద్రత, నైపుణ్యాభివృద్ధి, కృత్రిమ మేధ (ఏఐ) వంటి రంగాల్లో బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గత పదేళ్ల కాలంలో భారత్‌లో సుమారు 17 కోట్ల ఉద్యోగాలను సృష్టించామని, 2017లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు 2025 నాటికి 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించారు. ఇదే సమయంలో మహిళ ఉపాధి రేటు 22 శాతం నుంచి 38.8 శాతానికి వృద్ధి చెందిందని వివరించారు. రాబోయే రెండేళ్లలో వ్యవస్థీకృత రంగంలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రవేశపెట్టినట్లు మాండవీయ తెలిపారు.

**ఉద్యోగ భద్రతతోనే మెరుగైన ఉత్పాదకత: మంత్రి వివేక్**

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించినప్పుడే వారి నుంచి మెరుగైన ఉత్పాదకతను సాధించగలమని తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాలు సామాజిక భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని, కార్మిక హక్కులను పరిరక్షించడంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. టామ్‌కామ్ ద్వారా జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యంతో కూడిన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు. కాగా, ఈ నెల 16 వరకు జరగనున్న ఈ సదస్సుకు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా సహా 14 దేశాల నుంచి దాదాపు 110 మంది ప్రతినిధులు హాజరయ్యారు.




# ఈఎస్ఐసీ లబ్ధిదారులు 15 కోట్లు

**దేశ శ్రమశక్తికి సేవ, గౌరవమే మా లక్ష్యం.. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడి**

## సనత్‌నగర్ 'ఈఎస్ఐసీ' ఆసుపత్రిలో కొత్త ఓపీడీ ప్రాంగణం ప్రారంభం


హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు/పీఐబీ): గత పదేళ్లలో ఈఎస్ఐసీ లబ్ధిదారుల సంఖ్య 7.5 కోట్ల నుంచి 15 కోట్లకు పైగా పెరిగిందని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. మంగళవారం సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆసుపత్రిలో రూ.211.13 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక అవుట్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కొత్త భవనం ద్వారా తెలంగాణలోని 12.30 లక్షల మందికి పైగా ఈఎస్ఐ బీమా చందాదారులు, లబ్ధిదారులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశాభివృద్ధికి "శ్రమశక్తి", "యువశక్తి" రెండు ప్రధాన స్తంభాలని పేర్కొన్నారు. సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఎంత అభివృద్ధి చెందినా, దేశ నిర్మాణంలో కార్మికుల పాత్రకు ప్రత్యామ్నాయం లేదన్నారు. అందుకే కార్మికులకు గౌరవం, సామాజిక భద్రత కల్పించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనాల ప్రకారం, భారతదేశంలో సామాజిక భద్రత పరిధి 2014లో 19 శాతం ఉండగా ప్రస్తుతం 64 శాతానికి చేరిందని, దాదాపు 94 కోట్ల మంది దీని పరిధిలోకి వచ్చారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్మిక సంస్కరణలను ప్రస్తావిస్తూ, గతంలోని 29 కార్మిక చట్టాలను నాలుగు సమగ్ర కార్మిక కోడ్‌లుగా మార్చినట్లు చెప్పారు. నియామక పత్రాల జారీ, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు వార్షిక ఉచిత ఆరోగ్య పరీక్షలు, స్త్రీ-పురుషులకు సమాన వేతనం, ఏడాది సేవ పూర్తిచేసిన ఉద్యోగులకు గ్రాట్యుటీ వంటి నిబంధనలను అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఓపీడీ భవన నిర్మాణంలో పనిచేసిన నిర్మాణ కార్మికులను మంత్రి ఘనంగా సత్కరించారు. అలాగే ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను పంపిణీ చేశారు.

**వచ్చే ఏడాదే రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభం**

రామగుండంలో ప్రతిపాదిత 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి, నాచారంలో ఈఎస్ఐ నర్సింగ్ కాలేజీని వచ్చే ఏడాదిలోనే ప్రారంభిస్తామని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందిస్తూ ఈ హామీ ఇచ్చారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆస్పత్రిలో నూతన ఓపీడీ బ్లాక్ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈఎస్ఐసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తన తండ్రి, మాజీ కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి హయాంలో చూసిన ఆస్పత్రితో పోలిస్తే ప్రస్తుతం సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రిలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. పూర్తిస్థాయి కార్డియాక్ కేర్ సెంటర్, బైపాస్ శస్త్రచికిత్సలు, అత్యాధునిక డయాలసిస్ యూనిట్లు, క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులోకి రావడం కార్మికులకు ఎంతో ప్రయోజనకరమని ఆయన అన్నారు. తెలంగాణలో సుమారు 20 లక్షల మంది బీమా చందాదారులు, 80 లక్షల మంది లబ్ధిదారులకు ఈఎస్ఐ సేవలు అందుతున్నాయని పేర్కొన్న మంత్రి, సనత్‌నగర్ ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గించేందుకు రామచంద్రాపురం, నాచారం ఆస్పత్రులను అత్యాధునిక వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరారు. రెండు ఆస్పత్రుల్లోనూ కార్డియాక్ కేర్, 20 పడకల డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రామగుండం తెలంగాణలోని ప్రధాన పారిశ్రామిక ప్రాంతమని, అక్కడి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి అత్యవసరమని మంత్రి వివేక్ వివరించారు. టెండర్ల ప్రక్రియ నిలిచిపోయినందున వెంటనే పునరుద్ధరించాలని కోరగా, కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ స్పందిస్తూ నిర్మాణాన్ని వేగవంతం చేసి వచ్చే ఏడాదిలోనే ఆస్పత్రిని ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. నాచారంలో ఈఎస్ఐ నర్సింగ్ కాలేజీ ఏర్పాటుపై కూడా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

# విద్యార్థులే పర్యావరణ పరిరక్షకులు

**'స్వచ్ఛత పక్షవాడా'లో కేంద్ర మంత్రి సురేశ్ గోపి**



హైదరాబాద్, జూలై 14 (పీఐబీ): పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి పౌరుడి బాధ్యతగా అలవర్చుకోవాల్సిన సంస్కృతి అని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి అన్నారు. విద్యార్థులు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు రాయబారులుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సంయుక్తంగా నిర్వహించిన 'స్వచ్ఛత పక్షవాడా' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలవుతున్న స్వచ్ఛ భారత్ మిషన్ దేశవ్యాప్తంగా ప్రజల ఉద్యమంగా మారిందని సురేశ్ గోపి పేర్కొన్నారు. పరిశుభ్రమైన తరగతి గదులు, చెత్తలేని వీధులు, పచ్చదనంతో కళకళలాడే విద్యాసంస్థలు బాధ్యతగల పౌరుల ప్రతిబింబమని, అవే దేశ నిర్మాణానికి బాటలు వేస్తాయని అన్నారు. 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన ఆయన, ప్రతి విద్యార్థి నాటిన మొక్కను సంరక్షించాలని సూచించారు. భావితరాలకు అందించే గొప్ప కానుక చెట్లేనని, అవి స్వచ్ఛమైన గాలి, నీడ, జీవవైవిధ్యం, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తాయని చెప్పారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. భారతదేశ ఇంధన భద్రతతో పాటు సుస్థిర అభివృద్ధి, సామాజిక సంక్షేమానికి పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం, హిందుస్తాన్ పెట్రోలియంతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, నయారా ఎనర్జీ సంస్థలు చేపడుతున్న సామాజిక కార్యక్రమాలను ఆయన అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిజాయితీ, కరుణ, ప్రకృతి పట్ల గౌరవాన్ని అలవర్చుకోవాలని సూచించిన మంత్రి, తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచడం, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని కోరారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న ఆయన, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, విద్య, సామాజిక బాధ్యతలను జీవితాంతం పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఇండియన్ ఆయిల్ తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాధిపతి పీయూష్ మిట్టల్, హిందుస్తాన్ పెట్రోలియం జనరల్ మేనేజర్ సుశీల్ కుమార్ రాయ్తో పాటు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో మంత్రి విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## పాటతోనే సీఎం అయ్యిండు

**కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు**

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): చిన్న సినిమా నిర్మాతలకు తమ పార్టీ అండగా నిలుస్తుందని, భవిష్యత్తులో తమకు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం లభిస్తే వారికి మేలు చేసేలా కొత్త సినీ విధానాన్ని తీసుకొస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదే సమయంలో ఇటీవలి ఎన్నికల్లో ఓ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసినంతగా ప్రజాదరణ పొందిన పాటకు సంగీతం సమకూర్చిన చరణ్ అర్జున్‌పై తనకు కాస్త కోపం ఉందని సరదాగా ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించాయి. దినేశ్ కుమార్, దివిజ ప్రభాకర్ జంటగా నటించిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్ర ప్రీ రిలీజ్ వేడుకకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు చరణ్ అర్జున్‌ను కవిత ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన అద్భుతమైన సంగీతాన్ని అందిస్తారని కొనియాడుతూ.. "చరణ్ అర్జున్ స్వరపరిచిన 'మూడు రంగుల జెండా' పాట ఒక వ్యక్తిని ముఖ్యమంత్రిని చేసింది. అంతటి శక్తిమంతమైన పాటను అందించినందుకు ఆయనపై నాకు కాస్త అలక, కోపం వున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ సినిమా పాటలు కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. సినిమా టైటిల్ 'వెంకట్రామయ్య గారి తాలూకా' ప్రస్తావన రాగా, 'తాలూకా' అనే పదం తెలంగాణలో అంతగా వాడుకలో లేదని కవిత అన్నారు. ఈ పేరు విన్నప్పుడు కాస్త భిన్నంగా అనిపించినా, భౌగోళికంగా రాష్ట్రాలు విడిపోయినా తెలుగు ప్రజలంతా ఒక్కటేనని, మనమంతా కలిసి ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ఇరు ప్రాంతాల సంస్కృతులను పరస్పరం గౌరవించుకున్నప్పుడే భాష, సంస్కృతి నిలబడతాయని, తెలుగు చిత్రసీమ మనందరినీ కలిపే ఒక గొప్ప మాధ్యమంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## బీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు చెప్తం: పొన్నం

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు.

## టీజీ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏబీవీ వాంగ్మూలం నమోదు

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏపీ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డు చేశారు. 2023లో వెంకటేశ్వరరావు కాల్ డేటా రికార్డింగ్స్ ను నిందితులు సేకరించినట్టు సిట్ గుర్తించింది. దీంతో, సాక్షిగా ఆయన వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు పలువురు పోలీసు మాజీ అధికారులు, రాజకీయ నేతలపై పక్కా సాక్ష్యాలతో తుది చార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు సిట్ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ కేసు నిందితుల జాబితాలో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల్ని చేర్చినట్లు గతంలో ప్రచారం జరిగింది.



# వద్దు బాబూ.. ఈ20 పెట్రోల్!

## వాహనాలు పాడవుతాయి.. మెజారిటీ జనాల్లో భయం.. సీ-ఓటర్ సర్వేలో కీలకాంశాలు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానంపై దేశవ్యాప్తంగా వాహనదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ కూటమిని సమర్థించే ఓటర్లు సైతం ఈ సరికొత్త ఇంధనాన్ని వాడేందుకు ఇష్టపడటం లేదని ప్రముఖ పరిశోధన సంస్థ 'సీ-ఓటర్' నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడైంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాల మైలేజ్ తగ్గడమే కాకుండా, ఇంజిన్లు దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళన దేశ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. ఈ-20 పెట్రోల్ వల్ల నష్టపోయిన ఒక్కరినైనా చూపించాలంటూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల విమర్శకులకు సవాల్ విసిరారు. అయితే, దీనిపై నిరసనకారులు తక్షణమే స్పందించారు. ఒక్కరిని కాదు.. ఇథనాల్ పెట్రోల్ వాడి తమ వాహనాలు పాడైపోయాయని లబోదిబోమంటున్న ఆరుగురు బాధితులను మంత్రి ముందర నిలబెడతామని ప్రతిసవాల్ చేశారు. అయితే మీడియా ముందుకు వెళ్లేకంటే ముందే, ఈ విషయమై గడ్కరీ తమతో నేరుగా సమావేశం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఇంధనం సురక్షితమేనని చెబుతున్నప్పటికీ, ముఖ్యంగా పాత వాహనాల యజమానులు ఈ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. దాదాపు 52.5 శాతం మంది ఎన్‌డీఏ మద్దతుదారులు తమ వాహనాల్లో ఈ-20 పెట్రోల్ వాడటానికి నిరాకరించగా, కేవలం 18.1 శాతం మంది మాత్రమే మొగ్గు చూపారు. ఇక ప్రతిపక్షాల మద్దతుదారుల్లో ఈ వ్యతిరేకత 57.9 శాతంగా ఉంది. మొత్తం మీద చూసుకుంటే దేశంలో 55.1 శాతం మంది వాహనదారులు ఈ ఇంధనానికి నో చెబుతున్నారు. ఇథనాల్ కలపడం వల్ల మైలేజ్ తగ్గుతుందని 52.8 శాతం మంది, అసలు వాహనాలే పాడైపోతాయని 54.2 శాతం మంది బలంగా నమ్ముతున్నారు.

## నా ప్రపంచమే కూలిపోయింది..
# న్యాయం చేయండి

**పుణే రియల్టర్ కేతన్ హత్య కేసులో ప్రధాని మోదీకి తల్లి లేఖ**

పుణే: పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ ఆయన తల్లి రాఖీ అగర్వాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తీవ్ర భావోద్వేగపూరితమైన లేఖ రాశారు. తన కుమారుడి మరణంతో తమ ప్రపంచం శూన్యమైందని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ కేసును కేవలం మరో ఫైల్‌గా పరిగణించవద్దని ప్రధానిని వేడుకున్నారు. గత నెల 18న 26 ఏళ్ల కేతన్ అగర్వాల్‌ను లోహగడ్ కోటపై నుంచి తోసి హత్య చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా నిర్ధారించిన పోలీసులు, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రధానమంత్రికి పంపిన ఈమెయిల్‌లో రాఖీ అగర్వాల్ తన మనోవేదనను పంచుకున్నారు. "ప్రతి తల్లిలాగే, నా కుమారుడు వివాహం చేసుకుని మా కళ్ల ముందే సంతోషంగా జీవించాలని కలలు కన్నాను. కానీ, విధి వైపరీత్యం వల్ల నా బిడ్డకు నేనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది" అని ఆమె పేర్కొన్నారు. ఇంట్లోని ప్రతి వస్తువు, అతని గది, దుస్తులు, అతని చిరునవ్వులు లేని నిశ్శబ్దం, అన్నీ తన కుమారుడిని గుర్తుచేస్తూ ప్రతిక్షణం నరకాన్ని చూపిస్తున్నాయని ఆమె వాపోయారు. కాగా, గత వారం కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, విచారణను వేగవంతం చేయాలని విన్నవించారు.

## హర్మ్యూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్

**20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మ్యూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఏఐ వాడండి.. భద్రత పెంచండి: ఆర్బీఐ




న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే పెద్దపీట వేయాలని అన్నారు. మంగళవారం ముంబైలో ప్రభుత్వ రంగ మరియు ఎంపిక చేసిన ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ఆర్బీఐ నిర్వహించిన అర్ధవార్షిక సమావేశంలో ఆయన ఈ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జె., డా. పూనమ్ గుప్తా, ఎస్. సి. ముర్ము, రోహిత్ జైన్‌లతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత బ్యాంకింగ్ రంగం అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు వివేకంతో కూడిన మద్దతును కొనసాగించాలని ఆయన బ్యాంకులను కోరారు.



**ఏడు నెలల్లో మూడోసారి**

**గరిష్ఠంగా రూ.37 వేల వరకు పెంపు**

## మళ్లీ పెరిగిన థార్ ధరలు

ముంబై: మహీంద్రా థార్‌ను కొనాలని భావిస్తున్న వారికి కంపెనీ మరో షాక్ ఇచ్చింది. కేవలం ఏడు నెలల్లోనే మూడోసారి ధరలు పెంచింది. ఈసారి వేరియంట్‌ను బట్టి గరిష్ఠంగా రూ.37 వేల వరకు సవరించింది. కొత్త ధరలు జులై 10 నుంచి అమల్లోకి వచ్చినట్లు కంపెనీ వెల్లడించింది. తాజా ధరల పెంపు థార్‌లోని అన్ని వేరియంట్లకు వర్తిస్తుందని మహీంద్రా తెలిపింది. ముడి సరకుల ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇంజిన్, గేర్‌బాక్స్, డ్రైవ్‌ట్రెయిన్ ఆధారంగా ధరల పెంపు మారుతోంది. టాప్ ఎండ్ ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ 2.2 డీజిల్ ఆటోమేటిక్ వేరియంట్‌పై అత్యధికంగా రూ.37 వేలు పెంచింది. ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ పెట్రోల్ ఆటోమేటిక్‌పై రూ.36 వేలు, ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ డీజిల్ మాన్యువల్‌పై రూ.34 వేల వరకు పెంచింది. ప్రస్తుతం థార్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.10.32 లక్షల నుంచి ప్రారంభమై, టాప్ వేరియంట్‌కు రూ.17.99 లక్షల వరకు ఉంది. ఎంట్రీ లెవల్ ఏఎక్స్‌టీ 2డబ్ల్యూడీ డీజిల్ మాన్యువల్ వేరియంట్ ధర రూ.10.32 లక్షలు కాగా, టాప్ స్పెక్ ఎల్ఎక్స్‌టీ 4డబ్ల్యూడీ డీజిల్ ఆటోమేటిక్ ధర రూ.17.99 లక్షలకు చేరింది.

## ఇప్పుడొద్దు.. సొంతిల్లు

### కలను వాయిదా వేస్తున్న యువత

### పెరుగుతున్న ఈఎంఐల వల్లే

*భారతదేశం యువత ఆలోచనా ధోరణిలో ప్రస్తుతం స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. సొంత ఇంటి కలను సాకారం చేసుకోవడం కంటే ఆర్థిక స్వాతంత్ర్యం సాధించడానికే మిలీనియల్స్, జెన్-జెడ్ ఉద్యోగులు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు.*



న్యూఢిల్లీ: గృహాల ధరలు, వడ్డీ రేట్లు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, దశాబ్దాల పాటు గృహ రుణాలకు కట్టుబడి ఉండటం కంటే, అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆదా చేసిన సొమ్మును ఇతర మార్గాల్లో పెట్టుబడిగా పెట్టేందుకే మొగ్గు చూపుతున్నారు. గృహ రుణాల ఈఎంఐలతో పోలిస్తే, నెలవారీ అద్దె చెల్లింపులే తక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఏళ్ల తరబడి రుణ భారాన్ని మోయడం కంటే, ఆ నిధులను ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం ద్వారా త్వరగా ఆర్థిక స్వేచ్ఛను సాధించవచ్చని నేటి తరం భావిస్తోంది. అంతేకాకుండా, అద్దె ఇళ్లలో నివసించడం వల్ల మెరుగైన ఉపాధి అవకాశాల కోసం ఇతర నగరాలకు సులభంగా మారే వెసులుబాటు ఉంటుందని, ఇది తమ కెరీర్ పురోగతికి తోడ్పడుతుందని వారు విశ్వసిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో యువ కొనుగోలుదారుల సందడి కనిపిస్తున్నప్పటికీ, మెట్రో నగరాల్లో ఆస్తుల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరడం ఈ కొత్త ధోరణికి దారితీస్తోంది. ఇంటి కొనుగోలు కోసం చెల్లించే డౌన్ పేమెంట్, ఈఎంఐ మొత్తాలను స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిగా పెడితే దీర్ఘకాలంలో మెరుగైన రాబడి వస్తుందనేది వారి ప్రధాన వ్యూహం.

## కబ్జాలో రైల్వే భూములు

### 42 స్టేడియాలకు సమానం
### ఆర్టీఐలో సంచలన నిజాలు



న్యూఢిల్లీ: భారతీయ రైల్వే భారీ భూకబ్జా సమస్యతో సతమతమవుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు 1,068.54 హెక్టార్ల విలువైన రైల్వే భూమి ఆక్రమణకు గురైనట్టు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వెల్లడైంది. 2025 మార్చి నాటి గణాంకాల ప్రకారం ఈ విషయం తెలిసింది. ఈ స్థలం పరిమాణం ఎంత పెద్దదంటే, ఇందులో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం అయిన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం లాంటివి ఏకంగా 42 నిర్మించవచ్చు. లేదా 1,496 ఫుట్‌బాల్ మైదానాలను ఏర్పాటు చేయవచ్చు. ఈ సమస్య తగ్గకపోగా ఏటా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.



## ఎల్పీజీ వినియోగానికి పాలసీ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఇరాన్ యుద్ధం ప్రభావంతో ప్రపంచ ఇంధన మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. ఎల్పీజీ ధరలు పెరుగుతున్న వేళ దేశంలో ఇంధన వినియోగ సామర్థ్యంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పూణే గ్యాస్ సంస్థ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖకు సంస్థ ప్రతిపాదనలు పంపింది. దేశంలో తొలిసారిగా ఎల్పీజీ వినియోగ సామర్థ్యానికి ప్రత్యేక విధానం తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. సరఫరా ఇబ్బందుల కారణంగా వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర సుమారు రూ.3,100కు చేరిందని సంస్థ గుర్తు చేసింది. ఏడాది ఆరంభంలో ఇది రూ.1,884 వద్ద ఉండేదని పేర్కొంది. ఈ ధరల పెరుగుదలతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, లాండ్రీలు, ఎంఎస్ఎంఈలు, తయారీ రంగ సంస్థలపై అదనపు భారం పడుతోందని వెల్లడించింది. ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న ఎల్పీజీని మరింత సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

# గోదావరి పుష్కరాలకు ఘన ఏర్పాట్లు

**ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి తొలి విడతలో రూ.117 కోట్లు.. బాసర నుంచి భద్రాచలం వరకు ముందస్తు ప్రణాళికలు**

### భక్తులకు అన్ని సౌకర్యాలు: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**(దూడం శ్రీశైలం, ఫ్రీలాన్స్ జర్నలిస్టు)**

2027 గోదావరి పుష్కరాలను దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం ధర్మపురి, కోటిలింగాల పుణ్యక్షేత్రాలను దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. వీఐపీ, సాధారణ స్నాన ఘాట్లు, రహదారుల విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్, తాగునీరు, పార్కింగ్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష నిర్వహించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రూ.1,000 కోట్లు కేటాయించిందని, అందులో భాగంగా ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, ఆలయాల పునరుద్ధరణ, మౌలిక సదుపాయాల కోసం తొలి విడతలో రూ.117 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ధర్మపురి అభివృద్ధికి అదనంగా రూ.50-60 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. అమ్మ ఫంక్షన్ హాల్ సమీపంలో వంతెన నిర్మాణం, ప్రత్యేక వీఐపీ ఘాట్, కోటిలింగాల వద్ద డబుల్ రోడ్డు నిర్మాణం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంబడి ఉన్న ప్రధాన పుణ్యక్షేత్రాల్లో పుష్కరాల ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఉగ్ర నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు తొలి విడతలో శ్రీకారం చుడుతున్నామని తెలిపారు.



పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. దేశంలోనే ఆదర్శంగా నిలిచే విధంగా 2027 పుష్కరాలను నిర్వహిస్తామని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిం చడంలో ఎలాంటి రాజీ ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్, ఆర్డీవో మధుసూదన్, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

### ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్

జగిత్యాల, జూలై 14 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు రాపాక నిఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్లక్ష్యం చేయడంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థుల చదువులు, సర్టిఫికెట్లపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కులని, ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అభిషేక్, ప్రశాంత్, కౌశిక్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ నగర్‌లో జోరుగా 'సర్'

కూకట్‌పల్లి, జూలై 14 (ఈవార్తలు): కూకట్‌పల్లి పరిధిలోని హనుమాన్ నగర్ పోలింగ్ స్టేషన్ నెం.603లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ప్రమీల, ఎం. లలిత, ఆర్. రాజేశ్వరి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, నింపిన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, రవి తదితరులు పాల్గొని ఓటర్లను చైతన్యపరిచారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని వారు సూచించారు. ఎస్‌ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఓటర్ల వివరాలను ఇంటింటికీ వెళ్లి ధృవీకరిస్తూ, అవసరమైన ఫారాలను స్వీకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు జాబితా వివరాలను సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## గరిమెళ్లకు విద్యార్థుల ఘన నివాళి

వేములవాడ అర్బన్, జూలై 14 (ఈవార్తలు): తొలి తెలుగు ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, "మాకొద్దీ తెల్లదొరతనం" గేయ రచయిత గరిమెళ్ల సత్యనారాయణ 133వ జయంతిని పురస్కరించుకుని వేములవాడ న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వికుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ల సత్యనారాయణకు విశిష్ట స్థానం ఉందన్నారు. ఆయన రచించిన "మాకొద్దీ తెల్లదొరతనం" గేయం సత్యాగ్రహ ఉద్యమానికి అపారమైన ఉత్తేజాన్ని అందించిందని, "దండాలు దండాలు భారతమాత" వంటి దేశభక్తి గీతాలు ప్రజల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించాయని పేర్కొన్నారు. దేశభక్తి కవిత్వం కారణంగా జైలు శిక్ష అనుభవించిన తొలి తెలుగు కవుల్లో గరిమెళ్ల ఒకరని, నిజాయితీ, నిర్భీతి, జాతీయ భావజాలానికి ఆయన ప్రతీకగా నిలిచారని అన్నారు. తెలుగు జాతీయ కవిత్వానికి గరిమెళ్ల కొత్త ఒరవడి తీసుకొచ్చారని, ఆయన రచనలు నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారదతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.




## మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించాలి

### సర్పంచుల సంఘం జేఏసీ నేత మేఘరాజు

గంగాధర, జూలై 14 (ఈవార్తలు): మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీమల్ల మేఘరాజును గంగాధర పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మేఘరాజు మాట్లాడుతూ మాజీ సర్పంచుల పదవీకాలం ముగిసి 31 నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులు చేపట్టిన సర్పంచులు వడ్డీలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు.

## ఎరువుల ఉచిత రవాణా కల్పించాలి

### ప్రభుత్వానికి వ్యవసాయ సంఘాల వినతి

జగిత్యాల, జూలై 14 (ఈవార్తలు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) ఎరువుల ఉచిత రవాణా సదుపాయాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జగిత్యాల జిల్లా సహకార సంఘాల ఫోరమ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ నిర్ణయం రైతాంగంపై అదనపు భారాన్ని మోపడంతో పాటు ఎరువుల కృత్రిమ కొరత, ధరల పెరుగుదలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత రవాణా రద్దుతో పీఏసీఎస్ నిర్వాహకులు సొంతంగా లారీలను ఏర్పాటు చేసి రవాణా ఖర్చులు భరించాల్సి వస్తుందని, ఆ భారం చివరకు రైతులపైనే పడుతుందని పేర్కొన్నారు.



దీంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడి, అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉచిత రవాణా రద్దుకు సంబంధించిన జీవోను వెనక్కి తీసుకోవాలని, గతంలో మాదిరిగానే మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాలకు ఉచితంగా ఎరువులు సరఫరా చేసే విధానాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల అధ్యక్షుల ఫోరమ్ అధ్యక్షుడు డా. రాజా సుమన్‌రావు, జగిత్యాల సహకార సంఘం అధ్యక్షుడు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, పోతారం సంఘం అధ్యక్షుడు సాగర్‌రావు, చందోలి సంఘం అధ్యక్షుడు వెంకట మాధవరావు, నూకపెల్లి సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌పై కేసు నమోదు చేయాలి

### పలు పోలీస్ స్టేషన్లలో బీఆర్ఎస్ ఫిర్యాదు

జగిత్యాల బ్యూరో, జూలై 14 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రత్యర్థులు, రైతులను ఉద్దేశించి హింసను ప్రేరేపించేలా, ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించేలా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.



ఈ మేరకు మంగళవారం కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ పోలీస్ స్టేషన్లలో పోలీసు అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి వ్యాఖ్యలు ప్రజలకు ఆదర్శంగా ఉండేలా ఉండాలని అన్నారు. హింసను ప్రేరేపించేలా లేదా రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలతో సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023లోని సంబంధిత నిబంధనల ప్రకారం తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు కోరినట్లు తెలిపారు.

## బీసీ రెసిడెన్షియల్ కాలేజీలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**విద్యార్థులతో కలిసి భోజనం.. నాణ్యమైన ఆహారం అందించాలని అధికారులకు ఆదేశం**

జగిత్యాల, జూలై 14 (ఈవార్తలు): జగిత్యాల బీసీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వంటశాల, స్టోర్‌రూమ్‌ను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, బూస్టర్ మెనూ అమలు, ఆహార పదార్థాల కేటాయింపుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పంక్తిలో కూర్చుని భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.



విద్యార్థులు ప్రస్తావించిన మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల భవనానికి సంబంధించిన అంశాలపై కూడా అధికారులతో చర్చించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కళాశాల హెల్త్ సూపర్వైజర్‌కు ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం పెంచడం, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తమ సమస్యలను నేరుగా తెలుసుకుని స్పందించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి-శ్రీనివాస్, కౌన్సిలర్ సాయి కిరణ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జయరాజ్, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగమైతుంటే ఆబ్కారీ సార్లు ఎక్కడ?

### రోడ్డుపక్కనే సిట్టింగ్‌తో ప్రయాణికులకు ఇబ్బందులు

### ఎండపల్లిలో వైన్స్ వద్ద బహిరంగ మద్యం సేవనం

ఎండపల్లి, జూలై 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్‌షాప్ వద్ద ఏర్పాటు చేసిన సిట్టింగ్‌లు, రహదారిపై అక్రమ పార్కింగ్‌తో జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైన్స్‌షాప్ వద్ద కార్లు, ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలో పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం కూడా జరిగిందని పేర్కొన్నారు. వైన్స్‌షాప్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా ఎక్సైజ్



అధికారులు స్పందించి అక్రమ సిట్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలని, రహదారిపై పార్కింగ్‌ను నియంత్రించాలని మహిళలు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సిట్టింగ్‌లు, షాపులపై నోటీసులు జారీ చేసి తొలగించే చర్యలు చేపడతామని గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఎక్సైజ్, పోలీసు శాఖలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## కుమారులను చంపి, తల్లి ఆత్మహత్య

### ఏపీలోని పల్నాడులో దారుణం

పల్నాడు, జూలై 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కన్నతల్లే తన ఇద్దరు బిడ్డలను కడతేర్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామంలో వెలుగుచూసింది. ఈ ఘోరకలియంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. విఠంరాజుపల్లికి చెందిన నక్కా భారతి (24)కు పాల వ్యాన్ డ్రైవర్ సునీల్ రెడ్డితో సుమారు ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి తేజేష్ రెడ్డి (6), హేమనాథ నాగిరెడ్డి (4) ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త చెడు వ్యసనాలకు బానిస అవడ్డంతో కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఈ క్రమంలో సునీల్ రెడ్డి సోమవారం రాత్రి విధులకు వెళ్లిన తర్వాత భారతి తన ఇద్దరు కుమారులకు విషమిచ్చి చంపింది. అనంతం ఆమె కూడా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురించి తెలియగానే గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతుల బంధువుల రోదనలతో ఆ ప్రాంతంలో కన్నీటి పర్యంతమైంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మూడు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వ్యక్తిగత కారణాలేమైనా ఈ దారుణానికి దారితీశాయా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## వైసీపీ నేత నాగార్జున యాదవ్‌కు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, జూలై 14 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అసభ్యకరమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేసులో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్‌లోని నాంపల్లి మేజిస్ట్రేట్ కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. అంతకుముందు తెలంగాణ పోలీసులు ఏపీలోని గుంటూరులో ఉన్న ఆయన నివాసంలో నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని 'స్విగ్గీ లేదా జొమాటో డెలివరీ బాయ్' అని, దేశంలోనే అత్యంత దురదృష్టకరమైన డెలివరీ బాయ్ ముఖ్యమంత్రి అయ్యారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉత్తర్వులను కూడా సీఎం సరిగ్గా చదవలేరని ఆరోపించారు. ఇటీవల ఓ ప్రముఖ టీవీ ఛానెల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు శత్రుత్వాన్ని ప్రోత్సహించేలా ఉన్నాయని టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కైలాష్ సజ్జన్ బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి, ఏపీ పోలీసుల సహకారంతో నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేశారు.

## కూటమి సర్కారు వల్లే మత్స్యకారులు మృతి: జగన్

విశాఖపట్నం, జూలై 14 (ఈవార్తలు): మత్స్యకారులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ నెల 4న జరిగిన పడవ ప్రమాదంలో ఆరుగురు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. విశాఖపట్నం సమీపంలోని జబ్బర్ తోటలో బాధిత మత్స్యకార కుటుంబాలను, ప్రమాదం నుంచి బయటపడిన చిన్నాను జగన్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తీరానికి 10 మైళ్ల దూరంలోనే ఘటన జరిగినా, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు మత్స్యకారులు జలసమాధి అయ్యారని దుయ్యబట్టారు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు బాధితులు కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టినా స్పందించలేదన్నారు. 5వ తేదీన చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడటంతో అతను బ్రతికి బయటపడ్డాడని తెలిపారు. ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారని, ఆ నివేదిక కూడా తప్పులతడకగా ఉందన్నారు. ప్రభుత్వానికి మానవత్వం లేదని, ఉంటే రూ.10 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునేవారు కాదన్నారు. ఇప్పటికైనా బాధితులకు రూ.కోటి చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, మత్స్యకార బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన నెలలోపే బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## ఏపీలో 'సర్' గడువు పొడగింపు

విజయవాడ, జూలై 14 (ఈవార్తలు): ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (రాజూవఎఘెఋశ్రీ ×త్వఅంఅజవ =వజఅంఅశీఅ – ా×=) ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.




వయ్యారి చిత్రం




## నా కాళ్లు నేల మీదే: అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. విడుదలైన తొలి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 61 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తోంది. అయితే, ఈ భారీ విజయంపై అఖిల్ అక్కినేని ఎంతో పరిణతితో స్పందించారు. తనకు దక్కిన ఆదరణ పట్ల కృతజ్ఞతగా ఉన్నప్పటికీ, అప్పుడే గాల్లో తేలిపోవడం లేదని, తన కాళ్లు ఇంకా నేల మీదే ఉన్నాయని స్పష్టం చేశారు. 'లెనిన్' చిత్రం మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించి, డిస్ట్రిబ్యూటర్లను లాభాల బాట పట్టించడం తనకు మాటల్లో చెప్పలేని సంతృప్తిని ఇచ్చిందన్నారు. "ఈ ఉదయం నా డిస్ట్రిబ్యూటర్ల నుంచి వచ్చిన మెసేజ్‌లు నాకు అత్యంత ఆనందాన్నిచ్చాయి. 'సార్, మా పెట్టుబడి వచ్చేసింది. ఈ రోజు నుంచి లాభాల్లోకి వెళుతున్నాం' అని వారు చెప్పారు. ఇది నాకు మాటల్లో చెప్పలేనంత శక్తిని, సంతృప్తిని ఇస్తోంది. వీకెండ్ ముగిసేలోపే నా వాళ్లంతా లాభాల్లో ఉన్నారు. నేను నా కుటుంబంతో సంతోషంగా ఉన్నాను, వారు వారి కుటుంబాలతో ఆనందంగా ఉన్నారు. ఇంతకంటే ఏం కావాలి!" అని అఖిల్ వివరించారు. సినిమా విజయంపై తండ్రి నాగార్జున స్పందన గురించి అడగ్గా, "ఈ విజయంపై నాన్న ప్రత్యేకంగా మాటలేమీ చెప్పలేదు. ఎంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ ఒక్క హగ్‌లోనే ఆయన చెప్పాలనుకున్నదంతా నాకు అర్థమైంది. ఆ ఒక్క అనుభూతి చాలు, పడిన కష్టమంతా మర్చిపోవడానికి!" అని అఖిల్ అన్నారు. తాము ప్రేక్షకుల కోసమే పనిచేస్తామని, వారి అభిమానాన్ని పొందినప్పుడు కలిగే అనుభూతి వెలకట్టలేనిదని అఖిల్ పేర్కొన్నారు. "మేము పనిచేసేది ప్రేక్షకుల కోసమే. వారు మా కంటెంట్‌ను ఆస్వాదించినప్పుడు, అంతకంటే నాకేం కావాలి? ఇది నాకు చాలా అనుకూలమైన పరిస్థితి. కానీ, అప్పుడే గాల్లో తేలిపోవడం లేదు. నేను ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది" అని వినమ్రంగా తెలిపారు.

## 'రా ఎన్టీఆర్'తో సంబంధం లేదు: తారక్ ఆఫీస్



స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న 'రా ఎన్టీఆర్' సంస్థతో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీఆర్ కార్యాలయం స్పష్టం చేసింది. ఆయన తరపున ప్రాతినిధ్యం వహించే హక్కు ఆ సంస్థకు లేదని తెలిపింది. ఎన్టీఆర్ సేవా కార్యక్రమాల వివరాలు కేవలం ఆయన అధికారిక బృందం ద్వారా మాత్రమే వెల్లడి అవుతాయని ప్రకటనలో స్పష్టం చేశారు. 'రా ఎన్టీఆర్' సంస్థ ఎన్టీఆర్‌తో సంబంధం ఉన్నట్లు ప్రజల్లో భ్రమ కలిగించేలా వ్యవహరిస్తోందని ఆఫీస్ ఆందోళన వ్యక్తం చేసింది. అనధికారిక సంస్థలు, వ్యక్తుల ద్వారా జరిగే ప్రచారాన్ని పరిగణనలోకి తీసుకోవద్దని అభిమానులు, శ్రేయోభిలాషులకు విజ్ఞప్తి చేసింది.

## 'జన నాయగన్' కోసం తగ్గిన కొడుకు!

సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్నలేటెస్ట్ భారీ యాక్షన్ ఎంటర్‌టైనింగ్ 'సిగ్మా'. ఈ సినిమాతో తమిళ స్టార్ హీరో, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ కంప్లీట్ అయిందని తెలుస్తుండగా.. భారీ అంచనాల మధ్య జులై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు మేకర్స్ ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. అయితే.. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వాయిదా పడినట్లు తెలుస్తుంది. జులై 24 దళపతి విజయ్ ప్రధాన పాత్రలో నటించిన 'జననాయగన్' సినిమా రిలీజ్ ఉండటంతో.. బాక్సాఫీస్ వద్ద తండ్రితో పోటీ వద్దు అని నిర్ణయించుకున్న 'సిగ్మా' డైరెక్టర్ జాసన్ సంజయ్ తన సినిమాను వాయిదా వేసుకున్నట్లు టాక్. ఈ మేరకు దీనిపై త్వరలోనే అప్డేట్ వచ్చే అవకాశం ఉందని కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.



## బికినీ అస్సలు వేసుకోను



స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి చేసుకుని, ఒక బిడ్డకు తల్లి అయినప్పటికీ గ్లామర్ విషయంలో ఎక్కడా తగ్గడం లేదు. తన సెకండ్ ఇన్నింగ్స్‌లో కూడా వరుస సినిమాలతో దూసుకుపోతున్న ఈ చందమామ.. అటు సోషల్ మీడియాలో కూడా హాట్ ఫొటోలు షేర్ చేస్తూ అభిమానులను అలరిస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ నటించిన 'ది ఇండియా స్టోరీ' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. షూటింగ్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 24న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇంటర్వ్యూలు ఇస్తున్న కాజల్.. తాజాగా ఒక ఆసక్తికరమైన ప్రశ్నపై ఎంతో ధైర్యంగా స్పందించారు. భవిష్యత్తులో బికినీ వేసుకునే పాత్రలు వస్తే నటిస్తారా? అనే ప్రశ్నకు కాజల్ అగర్వాల్ ఎవరూ ఊహించని విధంగా సమాధానమిచ్చారు. తనకు బికినీ వేసుకోవడం అస్సలు ఇష్టం ఉండదని, అలాగే హద్దులు దాటిన రొమాంటిక్ సీన్స్‌లో కూడా ఎట్టిపరిస్థితుల్లో నటించనని ఆమె ఖరాఖండిగా చెప్పారు. నటిగా కెరీర్ ప్రారంభించినప్పటి నుంచి తనకంటూ కొన్ని హద్దులు, నియమాలు పెట్టుకున్నానని, వాటిని ఎప్పుడూ దాటబోనని స్పష్టం చేశారు.

## వంద మందిలో ఉన్నా ఒంటరినే: అవికాగోర్

చిన్నారి పెళ్లి కూతురు సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుని, పలు విజయవంతమైన తెలుగు చిత్రాల్లో నటించిన నటి అవిక గోర్.. ఒంటరితనంపై సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. తన చుట్టూ ఎంతో మంది ఉన్నప్పటికీ తాను ఎదుర్కొంటున్న మానసిక ఒంటరితనం గురించి ఆమె పంచుకున్న మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. "ఒంటరితనం అంటే ఎప్పుడూ ఒంటరిగా ఉండటం మాత్రమే కాదు. వంద మంది తెలిసినా, మనకు చోటెక్కడుందో తెలియకపోవడం కూడా ఒంటరితనమే" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "ఇప్పటికే ఏర్పడిన స్నేహితుల బృందాల్లో చేరేందుకు ప్రయత్నించడం చాలా అలసటగా ఉంటుంది. కెరీర్‌కే నా జీవితాన్ని అంకితమిచ్చాను. కాలం గడిచేకొద్దీ బంధాలను నిలబెట్టుకోవడం ఎంత కష్టమో ఆలస్యంగా గ్రహించాను" అని ఆమె వివరించారు. "ఇప్పుడు మనం స్నేహం కోసం సిద్ధంగా ఉన్నా, అప్పటికే అందరూ వారి సొంత గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అందరూ తెలిసినా, ఎక్కడికీ చెందని వారిలా మిగిలిపోతాం. నన్ను చేర్చుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు" అని అవిక తన ఆవేదనను వ్యక్తం చేశారు. కెరీర్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వ్యక్తిగత సంబంధాలు ఎలా ప్రభావితమవుతాయో అవిక మాటలు స్పష్టం చేస్తున్నాయి. చాలా మంది అనుభవించే ఇలాంటి భావాలను ఆమె ధైర్యంగా పంచుకోవడం గమనార్హం.



## కెమెరా ముందు బట్టలు మార్చుకో.. జరీన్ ఖాన్ వార్నింగ్!

బాలీవుడ్ నటి జరీన్ ఖాన్ ముంబైలోని ఓ దుకాణం ప్రారంభోత్సవంలో పాపరాజీల (ఫొటోగ్రాఫర్లు) ప్రవర్తనపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన పరిధులు దాటి అసభ్యకరంగా మాట్లాడిన ఒక ఫొటోగ్రాఫర్‌ను ఆమె అక్కడికక్కడే నిలదీసి గట్టిగా మందలించారు. ఈవెంట్‌లో భాగంగా జరీన్ ఖాన్ ఒక జీన్స్ అవుట్‌ఫిట్‌ను చేతితో పట్టుకుని కెమెరాలకు పోజులిస్తున్నారు. ఆ సమయంలో అక్కడున్న ఒక ఫొటోగ్రాఫర్.. "ఆ బట్టలను ఒకసారి ఇక్కడే వేసుకుని చూపించవచ్చు కదా" అని వ్యాఖ్యానించాడు. దాంతో తీవ్రంగా కలత చెందిన జరీన్.. "మీ అందరి ముందా? అది అస్సలు కుదరదు" అంటూ తీవ్రంగా స్పందించారు. అంతటితో ఆగకుండా, "నాతో ఇలాంటి పిచ్చి వేషాలు వేయకండి, నేను పడే రకాన్ని కాను. అందరూ మీ హద్దుల్లో ఉండండి" అంటూ హిందీలో గట్టిగా హెచ్చరించారు. సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలను గౌరవించకుండా, వృత్తిపరమైన హద్దులు దాటి ప్రవర్తించే వారికి ఇలాంటి బుద్ధి చెప్పడమే సరైన నిర్ణయమని నెటిజన్లు ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు.





## సస్పెన్స్ థ్రిల్లర్‌తో హన్సిక రీ ఎంట్రీ

ఒకప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్ల అందుకుంటూ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది హన్సిక. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో ప్రేమ వివాహం చేసుకుని సినిమాలకు దూరం కాగా.. ఇటీవల విడాకులు తీసుకుని ప్రజెంట్ తన సెకండ్ ఇన్నింగ్స్‌పై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు సినిమా ఆఫర్ల కోసం ఎదురు చూస్తూనే పలు షోలకు జడ్జీగా వ్యవహరిస్తూ సందడి చేస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా హన్సిక సినిమాకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఒకటి వైరల్‌గా మారింది. చాలా గ్యాప్ తర్వాత ఈ బ్యూటీ మళ్లీ శాండల్‌వుడ్‌కు తిరిగి ఎంట్రీ ఇవ్వబోతుంది. దివంగత పునీత్ రాజ్‌కుమార్ సరసన 'బిందాస్' సినిమాతో కన్నడలో అరంగేట్రం చేసిన హన్సిక.. ఆ తర్వాత మళ్లీ కన్నడలో సినిమా చేయలేదు.









# అక్షర్ ఆల్‌రౌండ్ షో

## బాల్, బ్యాట్‌తో ఇంగ్లండ్‌కు చుక్కలు.. 4 వికెట్లు, హాఫ్ సెంచరీ

### తోడుగా వాషింగ్టన్ సూపర్ షో.. గెలుపు బాట పట్టిన టీమిండియా.. తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై విజయం

ఇటీవల ఐర్లాండ్‌తో టీ20ల్లో ఓటమి, ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో 0-4 తేడాతో వైట్‌వాష్ ఎదుర్కొని తీవ్ర విమర్శలు మూటగట్టుకున్న టీమిండియా ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు అద్భుత ప్రదర్శనతో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది.

259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80 రిటైర్డ్ హర్ట్) అద్భుత అర్ధశతకంతో శుభారంభం అందించాడు. అయితే, రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో జట్టుపై ఒత్తిడి పెరిగింది. శ్రేయస్ అయ్యర్ (35)తో కలిసి గిల్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కానీ కీలక సమయంలో గిల్ గాయంతో మైదానం వీడటం, ఆ తర్వాత అయ్యర్, కేఎల్ రాహుల్ (1) వెంటవెంటనే ఔటవడంతో భారత్ 160 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో అద్భుతంగా ఆడిన ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్), అక్షర్ పటేల్ (57 నాటౌట్) అజేయమైన ఐదో వికెట్‌కు 102 పరుగులు జోడించి మరో 28 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌట్ అయింది. భారత బౌలర్ల ధాటికి ఒక దశలో 80 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను జో రూట్ (76 నాటౌట్), లియామ్ డాసన్ (68) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 4 వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఇక ఇరుజట్ల మధ్య రెండో వన్డే కార్డిఫ్‌లో జులై 16న జరగనుంది.

# అభిషేక్ శర్మకు ఢిల్లీ హైకోర్టులో ఊరట

టీమిండియా యువ క్రికెటర్ అభిషేక్ శర్మకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. సోషల్ మీడియాలో ఈ-కామర్స్ సైట్లలో తన అనుమతి లేకుండా పేరును, ఫొటోలను వాడుకుంటూ కొందరు చేస్తున్న వ్యాపారాలకు, అసభ్యకర ప్రచారాలకు కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. అభిషేక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జ్యోతి సింగ్.. కీలక ఆదేశాలు జారీచేశారు. అతని అనుమతి లేకుండా పేరు, ముఖచిత్రం, లేదా పర్సనాలిటీ రైట్స్‌ను కమర్షియల్ ప్రయోజనాల కోసం గానీ, సొంత ప్రచారం కోసం గానీ వాడకూడదని థర్డ్ పార్టీలపై కోర్టు నిషేధం విధించింది. అంతేకాదు ఇలాంటి అభ్యంతరకర లింకులను వెంటనే తొలగించాలంటూ మెటా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌తోపాటు ఈ-కామర్స్ వెబ్‌సైట్లను ఆదేశించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వాడుకుని కొందరు అభిషేక్ శర్మకు సంబంధించిన నకిలీ ఫొటోలు, వీడియోలను సృష్టిస్తున్నారు. దీనిని సవాల్ చేస్తూ అభిషేక్ శర్మ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తాజా విచారణలో ఇది అతని గౌరవానికి, బ్రాండ్ వాల్యూకు నష్టం కలిగించేలా ఉన్నాయని అభిషేక్ తరఫు పిటిషనర్లు కోర్టుకు తెలిపారు. కొంతమంది వెబ్‌సైట్లలో అతని మార్ఫింగ్ ఫొటోలపై అసభ్యకరమైన కామెంట్లు పెడుతున్నారని ఆరోపించారు. అతని అనుమతి లేకుండా అతని పేరు, ఫొటోలతో టీ-షర్టులు, బట్టలు తయారు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి జస్టిస్ జ్యోతి సింగ్.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సృష్టించే ఇలాంటి నకిలీ కంటెంట్‌ను వ్యాప్తి చేయడం, అలాగే అతని పేరుతో అక్రమంగా దుస్తులు, వస్తువులు అమ్మడంపై నిషేధం విధించారు. అభిషేక్ శర్మ ప్రస్తుతం భారత జాతీయ జట్టులో కీలక ఆటగాడని, అంతర్జాతీయ క్రికెట్లో ఎదుగుతున్న ఒక ప్రభావవంతమైన వ్యక్తిగా గౌరవించాలని కోర్టు కోరింది.

# నార్వేకు స్వదేశంలో ఘన స్వాగతం



ఫిఫా వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించిన జట్టుకు స్వదేశంలో అపూర్వ స్వాగతం లభించింది. ట్రోఫీ గెలవకపోయినా అభిమానుల ప్రేమ ఏమాత్రం తగ్గలేదని నార్వే మరోసారి నిరూపించింది. వేలాది మంది ఒకేచోట చేరి ఆటగాళ్లను అభినందించడంతో రాజధాని ఓస్లో పండుగ వాతావరణాన్ని తలపించింది. ఫిఫా వరల్డ్ కప్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన నార్వే జట్టుకు స్వదేశంలో ఘన స్వాగతం లభించింది. ఆటగాళ్లను అభినందించేందుకు దాదాపు 90 వేల మంది అభిమానులు రాయల్ ప్యాలెస్ బయటకు చేరుకున్నారు. మయామిలో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లండ్‌తో అదనపు సమయంలో 2-1 తేడాతో ఓడినా, నార్వే జట్టు ప్రదర్శనకు అభిమానులు అనూహ్యంగా స్పందించారు. ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలో ఆ దేశానికి ఇదే అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది. వేదికపైకి వచ్చిన ఆటగాళ్లకు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆటగాళు ,, అభిమానులు కలిసి 'వైకింగ్ రో' సంబరాల్లో పాల్గొన్నారు. టోర్నీ అంతా అభిమానులను అలరించిన ఈ ప్రత్యేక వేడుక మరోసారి అక్కడి వాతావరణాన్ని ఉత్సాహంతో నింపింది.

# గంభీర్-అగార్కర్ డిష్యుం డిష్యుం: డీకే

గతంలో ఎన్నడూ లేని విధంగా పొట్టి ఫార్మాట్లో టీమిండియాకు ఇటీవల ఘోర పరాభవాలు ఎదురయ్యాయి. టీ20 ప్రపంచకప్ చాంపియన్‌గా ఐర్లాండ్ గడ్డ మీద అడుగుపెట్టిన భారత్.. పసికూన అయిన ఆతిథ్య జట్టు చేతిలో 2-0తో క్లీన్‌స్వీప్ అయింది. అనంతరం ఇంగ్లండ్‌కు వెళ్లి అక్కడా ఆతిథ్య జట్టు చేతిలో 4-0తో వైట్‌వాష్‌కు గురైంది. ఈ నేపథ్యంలో టీమిండియా యాజమాన్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా తుదిజట్టులో తరచూ మార్పులు, వరల్డ్‌కప్ హీరో సంజూ శాంసన్‌ను పక్కనపెట్టడం విమర్శలకు కారణమయ్యాయి. అంతేకాదు.. అంతకుముందు టీ20 జట్టు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్‌ను నియమించే విషయంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ప్రధాన పాత్ర పోషించినట్లు.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మాత్రం తీవ్రంగా



వ్యతిరేకించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వరుస ఓటముల నేపథ్యంలో ఈ విషయం కూడా మరోసారి తెరమీదకు వచ్చింది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ దినేశ్ కార్తీక్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. గంభీర్- అగార్కర్ మధ్య విభేదాల వల్లే భారత జట్టుకు ఈ దుస్థితి వచ్చిందని పరోక్షంగా దుయ్యబట్టాడు. వీరి వైఖరి కారణంగా ఆటగాళ్లలో ఒక రకమైన గందరగోళం నెలకొందని పేర్కొన్నాడు. ఈ మేరకు.. "చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ భవిష్యత్తు గురించి ఆలోచిస్తాడు. దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా పటిష్ట జట్టును తయారు చేయాలని భావిస్తున్నాడు. అయితే, కోచ్ గంభీర్ మాత్రం అలా కాదు. ప్రతి ఒక్క మ్యాచ్, ప్రతి ఒక్క సిరీస్ గెలవాలనే లక్ష్యంతో ఉన్నాడు. ఒకరేమో దీర్ఘకాలిక ప్రయోజనాలు.. మరొకరు ఇప్పటికిప్పుడు వచ్చే ఫలితాల గురించి ఆలోచించడం వల్ల బహుశా ఇద్దరి మధ్య ఒక రకమైన ఘర్షణ జరిగి ఉంటుంది. దీంతో ఆటగాళ్ల మనసుల్లో గందరగోళం నెలకొంది. చీఫ్ సెలక్టర్, కోచ్ ఆలోచనల మధ్య వ్యత్యాసం ఆటగాళ్లకు మంచిదేనా? అంటే అస్సలు కాదనే చెప్తాను. ఇలాంటి సమయంలో వారికి జట్టులో తమ స్థానం గురించి అభద్రతాభావం ఏర్పడుతుంది.

# భారత్‌లో తొలి మ్యాచ్

## మొత్తం 40 రెగ్యులర్ మ్యాచ్‌లు.. డెజిగ్నేటెడ్ బ్యాటర్, ఫీల్డర్ విధానం.. బీబీఎల్-16 షెడ్యూల్ రిలీజ్

ఆస్ట్రేలియాలో క్రికెట్ అభిమానులకు పండగలాంటి వార్త. ప్రతి ఏటా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే కేఎఫ్‌సీ బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్) 16వ సీజన్ షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) విడుదల చేసింది. ఈసారి లీగ్‌లో ఎన్నో చారిత్రక మార్పులకు శ్రీకారం చుట్టారు. బీబీఎల్ చరిత్రలోనే తొలిసారిగా ఒక మ్యాచ్‌ను ఆస్ట్రేలియా వెలుపల, అదీ భారత్‌లోని చెన్నైలో నిర్వహించనున్నారు. అంతేకాకుండా నాలుగేళ్ల తర్వాత మళ్లీ క్రిస్మస్ ఈవ్ (డిసెంబర్ 24) రోజున మ్యాచ్‌ను ప్రవేశపెడుతూ అభిమానులకు డబుల్ ధమాకా అందించారు. 2026-27 వేసవి సీజన్‌ను మరింత ఉత్సాహభరితంగా మార్చే లక్ష్యంతో ఈ షెడ్యూల్‌ను రూపొందించారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో ఈ సీజన్ అధికారికంగా ప్రారంభం కానుంది. ఈ తొలి మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, డిఫెండింగ్ ఛాంపియన్ పెర్త్ స్కార్చర్స్‌తో తలపడనుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:40 గంటలకు ఈ మ్యాచ్ మొదలవుతుంది. ఆస్ట్రేలియా, భారత ప్రధానులు సంయుక్తంగా ఈ చారిత్రక మ్యాచ్‌ను ప్రకటించడం విశేషం. చెన్నై మ్యాచ్ తర్వాత అసలు సిసలైన బీబీఎల్ సందడి ఆస్ట్రేలియాలో మొదలవుతుంది. డిసెంబర్ 15న గబ్బా స్టేడియంలో బ్రిస్బేన్ హీట్, సిడ్నీ సిక్సర్స్ మధ్య మ్యాచ్‌తో ఆసీస్ గడ్డపై టోర్నీ ప్రారంభమవుతుంది. ఈ సీజన్‌లో మొత్తం 40 రెగ్యులర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. క్రిస్మస్ రోజు మినహా దాదాపు ప్రతిరోజూ మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. ఈసారి షెడ్యూల్‌లో క్రిస్మస్ ఈవ్ మ్యాచ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. నాలుగేళ్ల విరామం తర్వాత, డిసెంబర్ 24న మెల్‌బోర్న్‌లోని జంక్షన్ ఓవల్ మైదానంలో రెనెగేడ్స్, హోబర్ట్ హరికేన్స్ జట్లు తలపడనున్నాయి.

# సాత్విక్ - చిరాగ్ జోడీ అవుట్



జపాన్ ఓపెన్‌లో దుమ్మురేపాలనుకున్న భారత డబుల్స్ ద్వయం కల చెదిరింది. టోర్నీలో ఫేవరెట్ అయిన సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి జంట అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మొదటి మ్యాచ్‌లోనే సాత్విక్ సాయిరాజ్‌కు భుజం గాయం తిరగబెట్టడంతో ఇక ఆడలేమంటూ.. తొలి ఈ స్టార్ జోడీ కోర్టును వీడింది. దాంతో.. డెన్మార్క్ జంటను విజేతగా ప్రకటించారు నిర్వాహకులు. ఫేవరెట్‌గా జపాన్ ఓపెన్ బరిలో నిలిచిన సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి ద్వయం తొలి మ్యాచ్‌తోనే ఇంటిదారి పట్టింది. డెన్మార్క్ ఆటగాళ్లు డానియెల్ లుండ్‌గార్డ్ - మాడ్స్ వెస్టెర్‌గార్డ్‌తో మ్యాచ్ సమయంలో సాత్విక్ కుడి భుజం గాయంతో ఇబ్బందిపడ్డాడు. నొప్పి కారణంగా అతడు ఆటను కొనసాగించలేకపోయాడు. దాంతో.. భారత జంట టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఈ ఏడాది పలుమార్లు సాత్విక్ భుజం గాయంతో బాధపడ్డాడు. మార్చి నెలలో ఇదే సమస్యతో సాత్విక్ చిరాగ్ ద్వయం స్విట్జర్లాండ్ ఓపెన్ నుంచి ఇంటొకొచ్చేసింది. ఏప్రిల్‌లో బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్.. అనంతరం ఇండోనేషియా ఓపెన్‌లో సైతం వీరు ఆడలేదు. అయితే.. థామస్ కప్‌లో కాంస్యం.. సింగపూర్ ఓపెన్‌లో టైటిల్ విజయంతో దారిలో పడిన ఈ జంట.. జపాన్ ఓపెన్‌ను బాధతో వీడక తప్పలేదు. ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా పెట్టుకున్న సాత్విక్ -- చిరాగ్ .. అంతకంటే ముందే బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడనున్నారు.

ఈవార్తలు
# ప్రజావాణి
బుధవారం 15-7-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# చెరువులను కాపాడితేనే నీటి భద్రత

తెలంగాణ చరిత్రను తిప్పి చూస్తే రాజులు కట్టిన కోటల కంటే ఎక్కువగా కనిపించేవి చెరువులే. కాకతీయుల కాలంలో నిర్మించిన వేలాది చెరువులు కేవలం నీటి నిల్వ కేంద్రాలు మాత్రమే కాదు; గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, వ్యవసాయానికి, జీవవైవిధ్యానికి వెన్నెముకగా నిలిచాయి. ఒక చెరువు నిండితే గ్రామం నిండేది. భూగర్భ జలాలు పెరిగేవి. పంటలు పండేవి. పశువులకు నీరు దొరికేది. గ్రామ జీవనం సుసంపన్నంగా ఉండేది. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చెరువులు పూడికతో నిండిపోయాయి. అనేక చెరువుల ఫీడర్ కాల్వలు మూసుకుపోయాయి. కొన్ని చోట్ల ఆక్రమణలు పెరిగాయి. పట్టణాల విస్తరణ పేరుతో సహజ జలమార్గాలు కనుమరుగవుతున్నాయి. ఫలితంగా కొద్దిపాటి వర్షం పడినా నీరు నిల్వ కాకుండా వృథాగా పారిపోతోంది. ఎండాకాలంలో మాత్రం తాగునీటి కోసం, సాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో నీటి నిర్వహణ ఒకటి. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం స్వభావం మారుతోంది. ఒకప్పుడు నాలుగు నెలల పాటు సమానంగా కురిసే వర్షాలు ఇప్పుడు కొద్ది రోజుల్లోనే భారీగా కురుస్తున్నాయి. తర్వాత మళ్లీ దీర్ఘకాలం ఎండలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి చుక్క వర్షపు నీటిని నిల్వ చేయగల వ్యవస్థ అవసరం. ఆ వ్యవస్థకు చెరువులే సహజమైన పరిష్కారం. భారీ ప్రాజెక్టులు అవసరమే. నదుల నుంచి నీటిని ఎత్తిపోసే పథకాలు కూడా అవసరమే. కానీ గ్రామీణ స్థాయిలో చెరువుల ప్రాధాన్యాన్ని అవి భర్తీ చేయలేవు. భారీ ప్రాజెక్టు నుంచి విడుదలైన నీరు కూడా చివరకు గ్రామ చెరువులకే చేరాలి. అక్కడి నుంచే భూగర్భ జలాలు పెరుగుతాయి. బావులు, బోర్లు నిలకడగా ఉంటాయి. అందుకే పెద్ద ప్రాజెక్టులు, చిన్న నీటి వనరులు పరస్పర పూరకాలు కావాలి; ప్రత్యామ్నాయాలు కావు. చెరువుల పరిరక్షణ అంటే కేవలం పూడిక తీయడం మాత్రమే కాదు. వాటి క్యాచ్‌మెంట్ ప్రాంతాలను కాపాడాలి. వర్షపు నీరు చెరువులకు చేరే కాల్వలను శుభ్రం చేయాలి. ఆక్రమణలను కఠినంగా తొలగించాలి. గ్రామస్థాయిలో నీటి వినియోగంపై అవగాహన పెంచాలి. ప్రతి చెరువుకు శాస్త్రీయ నిర్వహణ ప్రణాళిక ఉండాలి. స్థానిక సంస్థలు, రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులు కలిసి చెరువులను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలి. హైదరాబాద్ వంటి నగరాలకు కూడా చెరువులు ప్రాణాధారం. ఒకప్పుడు నగరాన్ని చుట్టుముట్టిన వందలాది చెరువులు వర్షపు నీటిని నిల్వ చేయడంతో పాటు వరదలను నియంత్రించేవి. ఇప్పుడు వాటిలో అనేకం ఆక్రమణలకు గురికావడంతో భారీ వర్షాల సమయంలో నగరం జలమయం అవుతోంది. చెరువులు మాయమైతే వరదలూ, నీటి కొరతా రెండూ ఒకేసారి ఎదురవుతాయనే విషయాన్ని ఇటీవలి అనుభవాలు స్పష్టంగా చూపిస్తున్నాయి. వ్యవసాయం కూడా చెరువులపై ఆధారపడి ఉంది. వర్షాలు ఆలస్యమైనా, మధ్యలో ఎండలు వచ్చినా చెరువుల్లో నిల్వ ఉన్న నీరు రైతుకు భరోసా ఇస్తుంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు చెరువులే జీవనాధారం. చెరువు బతికితే గ్రామ ఆర్థిక వ్యవస్థ బతుకుతుంది. ప్రభుత్వాలు చెరువుల పునరుద్ధరణకు అనేక కార్యక్రమాలు చేపట్టినా, వాటి ఫలితాలు దీర్ఘకాలికంగా ఉండాలంటే నిరంతర నిర్వహణ అవసరం. ఒకసారి పూడిక తీసి వదిలేయడం కాదు; ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందే చెరువుల పరిస్థితిని సమీక్షించే వ్యవస్థ ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానంతో చెరువుల మ్యాపింగ్, నిల్వ సామర్థ్యం అంచనా, ఆక్రమణల గుర్తింపు వంటి చర్యలను వేగవంతం చేయాలి. నీటి సమస్య భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ప్రపంచవ్యాప్తంగా నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ తన చారిత్రక జలవనరుల వ్యవస్థను కాపాడుకోగలిగితేనే భవిష్యత్తులో నీటి భద్రతను సాధించగలదు.




**ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే జర్నలిజం నేడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవడం, అన్యాయంపై గొంతెత్తడం వంటి బాధ్యతలను మోస్తున్న పాత్రికేయుల జీవిత భద్రత మాత్రం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు సమాజంలో గౌరవం, విశ్వసనీయత పొందిన ఈ వృత్తి నేడు అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది.**

ప్రజల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే క్షేత్రస్థాయి జర్నలిస్టులు అవసర సమయంలో ఒంటరిగా మిగిలిపోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ నాయకుల ఎదుగుదలలో, ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకం. ఒక నాయకుడి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేది కూడా మీడియానే. కానీ అదే జర్నలిస్టు కష్టాల్లో ఉన్నప్పుడు, అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు లేదా మరణించినప్పుడు అండగా నిలిచే వ్యవస్థ బలహీనంగా ఉండటం బాధాకరం.

కేవలం రాజకీయ నాయకులే కాదు, మీడియా సంస్థల బాధ్యత కూడా ఈ సందర్భంలో చర్చకు వస్తోంది. క్షేత్రస్థాయిలో ఎండా వానా లెక్కచేయకుండా వార్తల కోసం తిరిగే జర్నలిస్టులకు అనేక సంస్థలు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, కుటుంబ భరోసా కల్పించలేకపోతున్నాయి. ఒక జర్నలిస్టు ఆకస్మికంగా మరణిస్తే అతని కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కనిపించకపోవడం వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది. ఇలాంటి పరిస్థితులకు అద్దం పట్టే ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పాత్రికేయుడు గజ్జెల శ్రీనివాస్ మరణం. గత పదేళ్లుగా జర్నలిజం వృత్తిలో కొనసాగిన శ్రీనివాస్.. సామాన్య ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో తన వంతు పాత్ర పోషించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలు, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఆయన ఆకస్మిక మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో ఉన్న ఆ కుటుంబం ఇప్పుడు భవిష్యత్తుపై ఆందోళనలో ఉంది. సమాజం కోసం పనిచేసిన ఒక జర్నలిస్టు కుటుంబం ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.

గజ్జెల శ్రీనివాస్ ఘటన ఒక్క కుటుంబానికి సంబంధించిన విషాదం మాత్రమే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది క్షేత్రస్థాయి జర్నలిస్టుల జీవిత భద్రతపై ఒక ప్రశ్న. జర్నలిస్టులను కేవలం వార్తలు అందించే వ్యక్తులుగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక భాగస్వాములుగా గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు కలిసి వారి కుటుంబాల భద్రతకు స్పష్టమైన విధానాలను రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది. అలాగే జర్నలిస్టులు కూడా వృత్తిపరమైన భేదాలను పక్కనపెట్టి, ఆపద సమయంలో ఒకరికొకరు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. గజ్జెల శ్రీనివాస్ కుటుంబానికి సానుభూతి మాత్రమే కాదు.. భవిష్యత్తుకు భరోసా అవసరం. ఒక జర్నలిస్టు కుటుంబం రేపటి రోజున అనాథగా మారకుండా ఉండేందుకు సమాజం, ప్రభుత్వం, మీడియా వ్యవస్థ కలిసి బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే... ప్రజల కోసం కలం పట్టే చేతులకు భద్రత లేకపోతే, ప్రజల గొంతుకను వినిపించే స్వరాలు క్రమంగా నిశ్శబ్దమయ్యే ప్రమాదం ఉంది.



**వొడ్యాల వేణు**
సీనియర్ పాత్రికేయుడు

# కాంగ్రెస్ పాస్ కావడం కష్టమే

**భారత రాజకీయాల్లో వ్యక్తుల కంటే విధానాలు గొప్పవి కావాలి. కానీ ఇటీవలి కాలంలో రాజకీయ చర్చల స్థాయి దిగజారుతూ వ్యక్తిగత విమర్శల చుట్టూనే తిరుగుతోంది. అధికార పక్షాన్ని విమర్శించడం ప్రతిపక్షం బాధ్యతే. అయితే ఆ విమర్శలు పాలన, విధానాలు, నిర్ణయాలు, ప్రజా సమస్యలపై ఉండాలే తప్ప వ్యక్తిగత స్థాయికి దిగజారితే ప్రజల్లో సానుకూల సందేశం వెళ్లదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా, విదేశాల్లోని భారతీయుల మధ్య గణనీయమైన ప్రజాదరణ కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు.**



ఆయన విదేశీ పర్యటనల్లో భారత ప్రవాసులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలకడం అనేక సందర్భాల్లో కనిపించింది. అలాంటి సందర్భాలపై రాజకీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం సహజమే. కానీ ప్రజల స్పందనను పూర్తిగా "పెయిడ్" అని కొట్టిపారేయడం వంటి వ్యాఖ్యలు రాజకీయంగా ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ కలిగించే అవకాశం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతి నాయకుడిని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి ఉంది. అయితే విమర్శకు కూడా హద్దులు ఉంటాయి. ఒక నాయకుడి ప్రజాదరణ నిజమా కాదా అనే చర్చ కంటే, ఆ ప్రజాదరణకు కారణమైన విధానాలు, నిర్ణయాలు, పరిపాలనపై చర్చించడం ప్రజలకు మరింత ఉపయోగకరం. ఎందుకంటే ప్రజలు వ్యక్తిగత ఆరోపణల కంటే తమ జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై స్పష్టమైన చర్చను కోరుకుంటున్నారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే సమయంలో ప్రజా సమస్యలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత వంటి అంశాలపై బలమైన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ప్రజలకు వివరించగలిగితే అది రాజకీయంగా మరింత ప్రభావవంతంగా ఉంటుంది. వ్యక్తిగత విమర్శలు తాత్కాలికంగా వార్తల్లో నిలిపినా, దీర్ఘకాలంలో ప్రజల్లో విశ్వాసాన్ని పెంచవు. ఇటీవలి ఎన్నికలు కూడా ఒక విషయాన్ని సూచిస్తున్నాయి. కేవలం అధికార పక్షాన్ని వ్యతిరేకించడం మాత్రమే సరిపోదు. ప్రజలకు ప్రత్యామ్నాయ పాలన ఎలా ఉంటుందో చూపించాల్సిన బాధ్యత ప్రతిపక్షంపై ఉంటుంది. విధానాలపై చర్చ తగ్గి వ్యక్తులపై దాడులు పెరిగితే రాజకీయ సంభాషణ నాణ్యత దెబ్బతింటుంది. ప్రజలు ఈ రోజుల్లో సమాచారంతో కూడిన ఓటర్లు. వారు ఎవరు ఎవరిని విమర్శించారన్నదానికంటే, ఎవరు తమ సమస్యలకు పరిష్కారం చూపగలరనే అంశాన్నే ఎక్కువగా పరిశీలిస్తున్నారు. అందువల్ల ప్రతిపక్షం విమర్శిస్తే అది వాస్తవాధారంగా, హుందాగా, విధానాలపై కేంద్రీకృతమై ఉండాలి. అదే సమయంలో అధికార పక్షం కూడా విమర్శలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వీకరించి సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి బలమైన ప్రభుత్వం ఎంత అవసరమో, అంతే బాధ్యతాయుతమైన ప్రతిపక్షం కూడా అవసరం. వ్యక్తిగత విమర్శలు రాజకీయ చర్చను బలహీనపరుస్తాయి. విధానాలపై పోటీ, అభివృద్ధిపై చర్చ, ప్రజా సంక్షేమంపై ప్రత్యామ్నాయ ఆలోచనలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయి. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలంటే వ్యక్తులపై విమర్శల కంటే ప్రజల జీవితాలను మార్చగల ప్రత్యామ్నాయ దిశను చూపించడమే ఏ రాజకీయ పార్టీకైనా స్థిరమైన మార్గం.

**- విద్యుల్లత కోరుకంటి**
రాజకీయ విశ్లేషకురాలు, వరంగల్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.